క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఘన సత్కారం



వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజులను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజులను పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా సత్కరించారు.

350 మందికి వైద్య సేవలు



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మర్రిపాలెం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ, డెంటల్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలిచ్చారు. 350 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



కేశ సంరక్షణపై స్థానికులకు సలహాలిస్తున్న డాక్టర్ సౌజన్య

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్కిన్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సౌజన్య పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ వేసవిలో వేడి నుంచి చర్మాన్ని కాపాడుకోవడానికి ఉపయోగించాల్సిన సన్‌స్క్రీన్ లోషన్స్ వివరాలను తెలియజేశారు. జుట్టు సంరక్షణకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. శిబిరంలో మురళీనగర్, మాధవధార ప్రాంతాలకు చెందిన 50 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి ఆధ్వర్యంలో పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, ఉపాధ్యక్షురాలు పి.మహాలక్ష్మి, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి ఎ.షీలారాణి, సంయుక్త కార్యదర్శి ఎస్.రత్నకుమారి, జి.శిరీషలత, సంయుక్త కోశాధికారి కె.భానుమతి, కార్యవర్గ సభ్యులు కె.బిందురాణి, సురేంద్ర కౌర్, పి.సుభద్ర, ఎం.స్వాతి, మాధురి శిబిరం నిర్వహణకు సహకరించారు.

సంకటహర చతుర్థి పూజలు

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా గురువారం లలితానగర్ లలితా పీఠం, సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్డులోని విజయ గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కంచరపాలెం: కంచరపాలెం జోన్–2 పరిధి బర్మాక్యాంప్ 33/11 కేవీ ఫీడర్స్‌లో పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఊర్వశి కూడలి జాతీయ రహదారి, పాలిటెక్నిక్ కళాశాల, నలందనగర్, దేవేంద్రనగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయ పరిధి, అశోక్‌నగర్, గంగన్ననగర్, జోగారావునగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

'ఉత్తర'ను మోడల్‌గా తీర్చిదిద్దుతా..

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- వేడుకగా పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం
- హాజరైన ముఖ్య నేతలు



వైఎస్సార్‌సీపీ ఉత్తర నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



ముస్లిం ప్రార్థనలు చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజు, బొత్స ఝాన్సీ, వరుదు కల్యాణి, పార్టీ నేతలు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనల నడుమ ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు మరో జన్మనిచ్చారన్నారు. రూ.1,450 కోట్లు వెచ్చించి నియోజకవర్గంలో 15 వేల నుంచి 18 వేల మంది యువతకు ఉపాధి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. జగనన్నతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు మనవైపు చూస్తున్నాయని, సచివాలయం–వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉత్తర నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు.

విష్ణుకుమార్‌రాజును చిత్తుగా ఓడిద్దాం

ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ–జనసేన–బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజును చిత్తుగా ఓడిద్దామని కె.కె.రాజు పిలుపునిచ్చారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. విష్ణుకుమార్‌రాజు అపరిచితుడిగా మాట్లాడాతాడని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓటు వేస్తే ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రైవేటుపరమవుతాయన్నారు. ప్రజలు ఆలోచించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఉత్తర ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

ప్రజలతోనే కె.కె.రాజు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ఓటమిని లెక్కచేయకుండా ప్రజల మధ్యే ఉంటూ వారి మన్ననలు పొందిన ఘనత కె.కె.రాజుదని కొనియాడారు. గత జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కె.కె.రాజు కీలకంగా వ్యవహరించి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించారన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. ఉమ్మడి విశాఖ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నగర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పోర్టు రహదారి, గిరిప్రదక్షిణ రహదారి పనులను ప్రజాప్రతినిధుల సూచనలు తీసుకుంటూ రోజుల వ్యవధిలో పూర్తి చేశామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు ఇలా సంచలనాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటూ సీఎం జగన్ ముందుకు అడుగులు వేశారన్నారు. పార్టీ కార్యాలయం బయట ఏర్పాటు చేసిన ఫ్యాన్ గుర్తులను చూపించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను మేయర్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, ఎస్ఏ రెహ్మాన్, చింతలపూడి వెంకటరామయ్య, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి, రవిరాజ్, హిర్ అహ్మద్, ఫరూఖీ, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కాశీ విశ్వనాథ్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, కీర్తి పట్నాయక్, పీలా వెంకటలక్ష్మి, పీలా ఉమారాణి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు కంపా హనోకు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, పి.ఉషశ్రీ, రజని, కె.కామేశ్వరి తదితరులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, సీనియర్ నాయకులు, డైరెక్టర్లు, భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

విశాఖ సిటీ: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించారు. ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై ఎంసీసీ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి. ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు.

ఉత్తర నియోజకవర్గంలో ఎంసీసీ బృందాల వివరాలు

టీమ్- 1:	ఎస్.శ్రీనివాసరావు, జీవీఎంసీ డీసీఆర్ :	99123 49437
	ఎస్.గంగాధర్‌రెడ్డి, ఏఎస్ఐ :	94400 32763
టీమ్- 2 :	బండారు శంకరరావు, మైన్స్ అండ్ జియాలజీ రోయల్టీ ఇన్‌స్పెక్టర్ :	98490 48379

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

టీమ్-1 :	ఎస్.మల్లేశ్వరరావు, హార్టీకల్చర్ సూపరింటెండెంట్ :	93986 75651
	కె.సీతామహాలక్ష్మి, ద్వారకా డబ్ల్యూఏఎస్ఐ :	91824 99540
టీమ్-2 :	ఎ.అప్పలనాయుడు, జీవీఎంసీ ఏవో :	81215 53524
	టి.శివకృష్ణ, ఫోర్త్ టౌన్ ఏఎస్ఐ :	95025 18325
టీమ్-3 :	ఎం.శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఎస్ఈ సూపరింటెండెంట్ :	98856 26134
	ఆర్.రామారావు, కంచపాలెం హెచ్‌సీ :	83418 04281

'మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలి'

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధులకు ప్రత్యేక అవసరాల ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు కోరారు. సంఘ నాయకులతో కలిసి గురువారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా మూల్యాంకనం కేంద్రంలో తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయుల విషయంలో వారి అభ్యర్థనను పరిశీలించాలిన కోరారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించారని పైడిరాజు తెలిపారు. సంఘం అధ్యక్షుడు దేముడు బాబు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నియంత్రించాలి

మహారాణిపేట: మాతాశిశు మరణాలు నిరోధించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో జిల్లాలో ఆరు మాతృ మరణాలు సంభవించాయన్నారు. లంకెలపాలెంలో రెండు, బక్కన్నపాలెం, ఏకేసీ కాలనీ, కణితి, గ్రామికనగర్ ప్రాంతాల్లో ఒక్కొక్క మరణం సంభవించాయన్నారు. ఈ విషయమై సంబంధిత వైద్యులు, ఏఎన్ఎంల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. ఏఎన్ఎంలు గర్భిణుల పేర్లు నమోదు చేసుకున్న నాటి నుంచి వారికి తగిన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ ఆస్పత్రుల అధికారి డాక్టర్ రమేష్‌కిషోర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీవో జయదేవి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, కేజీహెచ్ ఎనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ జీవీ గణేష్, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వీవీ శ్రీనివాసరెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ పి.ఉష, అగనంపూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, పలు విభాగాల అధిపతులు ఐ.మనోరమ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తా..



మాట్లాడుతున్న జి.వి.రవిరాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ పూర్వవైభవం కొనసాగుతుందని ఆ పార్టీ నాయకుడు జి.వి.రవిరాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత కారణాల వల్ల 2014 ఎన్నికల తరువాత రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉన్నానని, 2024 ఎన్నికల ప్రకటన నేపథ్యంలో తిరిగి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి విశాఖ పరిధిలో అనేక బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, తన వల్ల మేలు జరిగితే ఓటు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఆయన నిజాయితీ, చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పార్టీకి దూరమైన వారిని తిరిగి దగ్గరకు తీసుకునే క్రమంలో సీఎం వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కలిశానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీల విజయానికి పూర్తి సహకారం అందిస్తూ వారితో కలిసి పనిచేయాలని, పార్టీ విజయానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి తనను ఆదేశించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నాయకులు బొగ్గ శ్రీను, పేడాడ రమణి కుమారి, అనూషా పట్నాయక్, కేవీ బాబా పాల్గొన్నారు.

మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న అతిథులు జి.ఎస్.ఎన్.రాజు, బాలమోహన్‌దాస్

సీతంపేట: మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ మేడా మస్తాన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలువురికి మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వి.చిట్టిబాబు, మా సంస్కృతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు లక్ష్మీభార్గవి చేతుల మీదుగా పురస్కారాలను అందించారు. తల్లిని కంటికి రెప్పలా, ప్రేమగా చూసుకుంటున్న కొడుకులు, కూతుళ్లు ఐదుగురిని పురస్కారాలకు ట్రస్టు ఎంపిక చేసింది. కళ్లపల్లి జగదీశ్వరరావు, కొణతం సేతు మాధవరావు, అనంతశెట్టి జనార్దనరావు, వప్పంగి అప్పలరాజు, గోగినేని రాధికలను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏడేళ్లుగా మాతృమూర్తి పురస్కారాలు అందజేస్తున్న మేడా మస్తాన్‌రావు ఎందరికో స్ఫూర్తినిస్తూ, ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత వేముల భాస్కరాచారి, విశ్రాంత లేబర్ కమిషనర్ డి.ఆర్.కె.రావు, ట్రస్టు ఉపాధ్యక్షులు మేడా పద్మావతి, సభ్యులు మేడా శివారెడ్డి, మేడా భరత్‌కుమార్, ప్రసన్న లక్ష్మి, భార్గవి, శంతన్, అక్షర్, అన్విత, అభిరామ్, పి.లలిత తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'భరత నాట్యం'



మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: క్రైమ్, కామెడీ, థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కించిన చిత్రం భరతనాట్యం అని హీరో సూర్యతేజ అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో చిత్ర యూనిట్ మీడియా మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఇది నా మొదటి చిత్రమని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోందన్నారు. దర్శకుడు కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ గతంలో తాను తీసిన దొరసాని సినిమాతో ఆనంద్ దేవర కొండ హీరోగా పరిచయం చేశానని, ఈ చిత్రం ద్వారా సూర్యతేజను పరిశ్రమకు పరిచయం చేయడం ఆనందంగా ఉందన్నారు. చిత్రాన్ని వచ్చేనెల 5న విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ మీనాక్షి గోస్వామి, నిర్మాత పాయల్ సరాఫ్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం చిన్నూరులో నజ్రీన్ బేగం కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఆమె కుమార్తె(17) ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతోంది. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇంటికి వెళ్లి కనుక్కోగా ఆచూకీ తెలియక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన రెండో భర్త అజీద్‌పై అనుమానం ఉందని బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేశారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

- 42వ వార్డులో గెడ్డల అభివృద్ధి
- సమస్యల పరిష్కారంపై స్థానికుల హర్షం



నాడు: ప్రమాదకరంగా రైల్వే న్యూకాలనీ జంక్షన్ గెడ్డ



నేడు: ఆధునికీకరించిన రైల్వే న్యూకాలనీ గెడ్డ



నాడు: అధ్వానంగా నాగన్న గెడ్డ



నేడు: ఆధునికీకరణ తరువాత నాగన్న గెడ్డ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులోని పలు గెడ్డలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. కొన్నేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోని గెడ్డలు.. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ కృషితో అభివృద్ధి బాట పట్టాయి. ముఖ్యంగా రైల్వే న్యూకాలనీ జంక్షన్ సింహగిరి లాడ్జి పక్కన గల గెడ్డ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహించే డ్రైనేజీలు, కాలువల మురుగు నీటితో ఈ గెడ్డ ప్రమాదకర పరిస్థితికి చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇది నాటి దుస్థితి. నేడు ఈ గెడ్డను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రమాదకర పరిస్థితి నుంచి బయటపడటంతో ప్రజలు సాఫీగా దీనిపై రాకపోకలు సాగించే వీలు కలిగింది. జీవీఎంసీ నూతన కౌన్సిల్ ఏర్పడిన అనంతరం వార్డుల అభివృద్ధికి కేటాయించిన నిధుల్లో సుమారు రూ.48 లక్షలతో కార్పొరేటర్ చొరవతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ గెడ్డకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్, బాటం కాంక్రీట్ పనులు పూర్తిచేశారు. గెడ్డ సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగన్న గెడ్డ సమస్యకు పరిష్కారం

ఇదే వార్డులో ప్రమాదకరంగా ప్రవహించే నాగన్న గెడ్డను అభివృద్ధి చేశారు. ఎగువ పాంతాల్లో ఉన్న కాలనీల నుంచి డ్రైనేజీల నీరు ఈ గెడ్డ ద్వారా ప్రవహించేది. గెడ్డలో పూడికలు, పెద్ద పెద్ద చెట్లు మొలిచి ప్రవాహానికి ఆటంకంగా మారితే.. మరోవైపు కనకారావు వీధి, హరగోపాల్ స్కూల్ ఎదురుగా గల ప్రాంతంలో గెడ్డ రక్షణ గోడ కూలి మురుగునీరు ఇళ్లలోకి ప్రవహించేది. ఇక వర్షాలు పడితే ఇళ్లన్నీ గెడ్డ నీటిలోనే మునిగిపోయేవి. 25 ఏళ్లుగా ఇదే పరిస్థితి. ఎంతమందికి విన్నవించుకున్నా పట్టించుకునే వారు కారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతికి స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. వెంటనే ఆమె వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త(ఎమ్మెల్యే అభ్యర్థి) కె.కె.రాజు, నాటి జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో పనుల కాంట్రాక్ట్ మంజూరు చేయించారు. ప్రాధాన్యతా క్రమంలో జీవీఎంసీ నిధులు రూ.39 లక్షలతో ఈ గెడ్డ ఆధునికీకరణ పనులను పూర్తిచేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ గోడ నిర్మాణం

రైల్వే న్యూకాలనీ వినాయక గుడి వెనుక ప్రాంతంలోని మరో గెడ్డను ఆనుకుని ఎన్నో నివాసాలు ఉన్నాయి. 2018 జూలై 14వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షాలకు గెడ్డ రక్షణ గోడ కూలిపోయింది. ఇక్కడ ఉండే రోడ్డు కూడా కొట్టుకుపోయింది. ఈ గెడ్డను ఆనుకుని ఉండే నిర్మాణాల పునాదులు సైతం కొట్టుకుపోయాయి. గతంలో అధికారులకు తెలియజేసినా.. ఎవరూ స్పందించలేదు. రోడ్డు కూలిపోకుండా ఉండేందుకు స్థానికులే తమ సొంత ఖర్చులతో తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసుకున్నారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి దృష్టికి స్థానికులు తీసకువెళ్లగా.. వెంటనే స్పందించి, నిధులు మంజూరు చేయించి గెడ్డ రక్షణ గోడ నిర్మించారు. దీంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించారు



25 ఏళ్లుగా నాగన్న గెడ్డ పరిస్థితి దారుణంగా ఉండేది. వర్షాలు పడితే తరచూ నీరు పొంగి ఇళ్లలోకి ప్రవహించేది. రక్షణ గోడ కూలిపోవడంతో సమస్య మరింత ఎక్కువైంది. కార్పొరేటర్‌గా ఆళ్ల లీలావతి శ్రీనివాస్ గెలుపొందిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించారు.

– పొట్నూరు చందన్‌సాయి, రైల్వే న్యూకాలనీ

జంక్షన్ రూపురేఖలు మారాయి



రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన గల గెడ్డ పైనుంచి నడవాలంటే భయపడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి కృషితో ఈ గెడ్డను ఆధునికీకరించారు. రైల్వేన్యూకాలనీ జంక్షన్ రూపురేఖలు సుందరంగా మారిపోయాయి.

– మద్దాల దుర్గాప్రసాద్, రైల్వే న్యూకాలనీ

నేతల సహకారంతో అభివృద్ధి



రైల్వే న్యూకాలనీలోని పలు ప్రధాన గెడ్డలతో కొన్నేళ్లుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే గెడ్డల సమస్యలు పరిష్కరించాలని భావించాను. వార్డుకు కేటాయించిన నిధులతో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ల సహకారంతో గెడ్డలను ఆధునికీకరించాం. ఈ పనులు మంజూరు చేయించిన మేయర్, జీవీఎంసీ కమిషనర్‌లకు కృతజ్ఞతలు.

– ఆళ్ల లీలావతి, 42వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ

జాతీయ స్థాయి బాక్సింగ్‌లో మురళీనగర్ బాలిక సత్తా



కర్రి చంద్రికను సత్కరిస్తున్న బాలభాను పాఠశాల యాజమాన్యం

మురళీనగర్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల బాక్సింగ్ టైటిల్ పోటీలో మురళీనగర్ బాలిక కర్రి చంద్రిక సత్తా చాటింది. ఈ పోటీలో పాల్గొని రజత పతకం సాధించి విశాఖ నగర కీర్తిని జాతీయ స్థాయిలో చాటింది. మురళీనగర్ బాలభాను విద్యాలయంలో చంద్రిక 7వ తరగతి చదువుతోంది. విజయం సాధించి మురళీనగర్ వచ్చిన సందర్భంగా గురువారం పాఠశాల కరస్పాండెంట్ బీఆర్‌కే రాజు చంద్రికను ఘనంగా సత్కరించారు. త్వరలో ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు రమణారావు పాల్గొన్నారు.